# మృగం

**వడ్లమన్నాటి కుటుంబరావు**

నందనరావు ఆనందంగా ఉండటానికి కారణా లనేకం ఉన్నా కొన్ని మాత్రం చెప్పుకుంటే చాలు ఈ కథ పూర్తి చేయటానికి

అతను అందంగా హుందాగా ఉంటాడు! అమ్మాయిల గుండెల్లోనే కాదు ఆడవాళ్ళందరి లోనూ అలజడి రేపగలడు అతను - డబ్బుగల వారబ్బాయి! వాళ్ళ నాన్న పి డబ్ల్యు డి. కంట్రాక్టరు చేస్తూ లక్షలు లక్షలు సంపాయించేస్తున్నాడు ఆయన కారుల్లో తిరుగుతూ అతనికి స్కూటరు కొనిచ్చేశాడు కాస్ట్లీ దుస్తులతో మెళ్ళో బంగారు గొలుసుతో .. జేబులో ఏచ్చు డబ్బుతో ఖులాసాగా ఉంటాడు నందనరావు!

సాధారణంగా లక్ష్మీ సరస్వతులకు పడదు కానీ ఆ దేవత లిద్దరూ నందనరావు విషయంలో రాజీ కొచ్చేశారని చెప్పక తప్పదు!

ఎందుకంటే ఇంజనీరింగ్ కాలేజీలో బి టెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న నందనరావుదే ఎప్పుడూ ఫస్ట్ రాంక్!

అదీగాక నందనరావు గొంతు చాలా మధురంగా ఉంటుంది అతను సినిమా పాటలు పాడుతుంటే కిషోర్ కుమార్ బాల సుబ్రమణ్యంలు ఆ పక్క నెక్కడన్నా నిల్చుని పాడుతున్నారా.. అనిపిస్తుంది ఇక ఘంటసాల రఫీ. ముఖేష్ పాటలు సరేసరి! వాళ్ళు ఇతనిలో పరకాయ ప్రవేశం చేసి పాడుతున్నారా అనిపిస్తుంది. దీనికి బాగా దోహదం చేసిన మరో అంశం.. అతనికి బాగా వచ్చిన మిమిక్రీ!

ఇంకో విశేష మేమంటే. నందనరావు చిన్న వయసులోనే ప్రఖ్యాత రచయిత అయి కూర్చున్నాడు అతని కథల్ని హాట్ కేకుల్లా తినేస్తారు- సాహితీప్రియులు- ఆడా మగా తేడా లేకుండా

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన యువకిశోరం నందనరావంటే ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు ఎవరింటి కెళ్ళినా అతనికి గజకేసరి యోగమే! పూర్ణకుంభ స్వాగతమే!

కొంత మంది అతనితో మిమిక్రీ చేయించుకుని పకాపకా నవ్వుతుంటారు వినోదంగా

ఇంకొంత మంది సినిమా పాటలు పాడించుకుని తన్మయత్వంలో మునిగి పోతారు

మరికొంత మంది అతని కథల్లోని ప్రత్యేకమైన అంశాల్ని పొగిడి ఆనందపరవశు లవుతారు

ఇంతవరకే ఉంటే ఇబ్బంది లేకపోను! అసలు చిక్కెక్కడ వచ్చిందంటే. విచ్చల విడిగా డబ్బు ఖర్చు పెట్టగల అతని మనస్తత్వాన్ని ఆసరాగా తీసుకుని మగ, ఆడ అభిమానులు అతన్ని అందంలో ఇంద్రుడనీ మెత్తని మనసుకి ఆకాశంలో చంద్రుడనీ డబ్బుకు కుబేరుడనీ దానగుణానికి అంటే ధారాళంగా ఖర్చుపెట్టటానికి కర్ణుడనీ పొగిడేశారు! మగవాళ్ళు పొగిడినందుకు అంతగా పొంగి పోలేదు గానీ "ఫెయిర్ సెక్స్" అభినందనలకి ఉబ్బిపోయాడు నందనరావు ఆ పొంగి పోవటం రాను రానూ గర్వంలోకి మారిపోయింది

అగ్నికి గాలి తోడయినట్టుగా ఒకరిద్దరు దుష్టమిత్రులు ఉచిత సలహా పారేశారు మహాబోధి సన్యాసులు చన్నీటిలో మునిగి తపస్సు చేసినా ఇలాంటి తరుణీమణులు దొరకరు కన్నె పిల్లల్లో ఆడవాళ్ళలో అందరూ పద్మినీ జాతి స్త్రీలే ఉండరు నీకేమున్నా ఇంద్రియన్ను ఉంటే నీ మీద వాళ్ళకి టేస్టు ఉండగానే చూసుకో!

ఈ సలహా బాగా నచ్చింది నందనరావుకి ఎలాంటి ఆడవాళ్ళు త్వరగా వల్లో పడతారో చెప్పమన్నాడు నందనరావు వాళ్ళకి గ్రాండ్ పార్టీ ఇచ్చి. విందు మందు సేవిస్తూ మత్తుగా గమ్మత్తుగా సూచన లిచ్చారు నందనరావుకి

తల్లిదండ్రుల కంట్రోలు లేని కన్నె పిల్లలు! అవాకారికి భార్యగా ఉన్న అందగత్తెలు! శాడిస్టు మొగుళ్ళు హింసిస్తున్న భార్యలు! వగైరాలు త్వరగా వశమవుతారని

అతనికి వెంటనే వెనక బజారు వరలక్ష్మి గుర్తొచ్చింది. ఆమె తన ఫ్రెండువాళ్ళ ఇంటి పక్క పోర్షనులో ఉంటోంది. తనక్కడ ఒకసారి పాటలు పాడుతుండే తనంతట తనే వచ్చి పరిచయం చేసుకుంది. ఆమెకి పట్టుమని ఇరవై ఏళ్ళు కూడా ఉండవు అందంగా పొంకంగా బింకంగా ఉంటుంది. భర్త మాత్రం తుమ్మ మొద్దులా బలిసిన ఎద్దులా ఉంటాడు వరలక్ష్మి స్వయంగా తీసుకెళ్ళి స్వయంగా పరిచయం చేసినప్పుడు అతను తనని మిర్రి మిర్రి చూడలేదు ఎవడే వీడు బాడ్కావ్?!" అంటూ భార్యని జుట్టు పట్టుకు గుంజి నాలుగు గుద్దులు వడ్డించ లేదు ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు "మీ లాంటి వాళ్ళు - మా ఇంటికి రమ్మని కాళ్ళు పట్టుకుని బతిమాలితే మాత్రం వస్తారా? ఇదంతా మీ మంచి మనసు మా అదృష్టం!" అన్నాడు తనతో ఇంకో రెండు పాటలు పాడించు కున్నాడు మిమిక్రీ బిట్స్ చేయించుకొని మృగంలా పడిపడి నవ్వాడు తన కసహ్యం వేసినా వరలక్ష్మి కోసం భరించాడు తను వెళ్ళేప్పుడు అన్నాడు ఇదిగో బాబూ! బంగారు బాబూ! మా వరాలు సంతోషమే నా సంతోషం అది ఏం చేసినా నా కిష్టమే! నేనున్నా లేకపోయినా నువ్వెప్పుడయినా రావచ్చు మా ఇంటికి పాటలు పాడొచ్చు. మిమిక్రీ చేసి దాన్ని సంతోష పెట్టవచ్చు!

అతనేదో షెడ్డులో మెకానిక్‌గా పని చేస్తున్నాడని వరలక్ష్మి చెప్పింది మెట్రిక్ తప్పాడని కూడా చెప్పినట్టు గుర్తు తనూ తొమ్మిదో క్లాసు చదివిందని చెప్పింది

ఆ తరువాత తన ఫ్రెండువాళ్ళు సొంతంగా ఇల్లు కట్టించుకుని వెళ్ళిపోయినా తను వరలక్ష్మి ఇంటికి రాకపోకలు మానలేదు

తనని చూస్తే చాలు పొంగి పోతుంది - వరలక్ష్మి పాటలు పాడించుకున్నాక మిమిక్రీ చేయించు కున్నాక ఎన్నోసార్లు పొగిడేది తన అందాన్ని డబ్బుని ఇతర ప్రతిభా విశేషాల్ని ఎన్నో రకాల టిఫిన్లు చేసి పెట్టేది -

నాకోసం మీరు తింటారు కదూ" అంటూ ఓరగా చూస్తూ తను నాలుగయిదుసార్లు ఖరీదయిన కేకులు బుట్టల నిండా పళ్ళు తీసుకెళ్ళి ఇస్తే వద్దంటూనే తీసుకొంది

ఆమె కూర్చున్నప్పుడు లేచి నిల్చున్నప్పుడు నడుస్తున్నప్పుడు ఆ వంపులు సొంపులు చూసి పరవశిస్తుంటే ఏంటలా చూస్తున్నారు?" అనేది - కవ్విస్తున్నట్టుగా ఒకటి రెండుసార్లు తను ఆమెతో మాట్లాడుతున్నప్పుడు ఆ "మృగం గాడొచ్చాడు తనని చూసి సంతోషపడ్డాడు గానీ అనుమానించటం విసుక్కోవటం ఏమీ చెయ్య లేదు

దీన్ని బట్టి తనకర్థమయ్యేదేమిటి? వరలక్ష్మి ఆ కురూపిని ఆ మృగంగాడిని అసహ్యించు కుంటోంది నాజూగ్గా అందంగా ఉన్న తన పొందు కోరుకొంటోంది ఆ మృగంగాడి క్కూడా తను వరలక్ష్మితో కులకటం అభ్యంతరంలేదు. వరలక్ష్మి అడిగిన డబ్బిస్తే చాలు గాబోలు!

ఇంకెందుకూ ఆలస్యం? తన ప్రణయకేళీ విలాసాన్ని ముందుగా వరలక్ష్మితో మొదలుపెడితే పోలా! లైన్ క్లియర్‌గా ఉందిగా అనుకున్న నందనరావు ఆనందంగా వరలక్ష్మి యింటికి పదు గత్తించాడు స్కూటర్ని పక్క పోర్షనుకున్న తాళం తన పాలిట వరంగా భావించిన నందన రావు మృదువుగా వరలక్ష్మి వాళ్ళ పోర్షన్ తలుపుల మీద కొట్టాడు

నిద్ర లేచి వచ్చి తలుపు తీసింది వరలక్ష్మి. ఆ మృగంగాడు ఈ సమయంలో ఉండడని తెలుసు నందనరావుకి

"సారీ వరలక్ష్మి! మీ బంగారంలాంటి నిద్ర పాడు చేసే అధికారం నాకు లేదు మళ్ళీ వస్తాను" అంటూ



తెచ్చిపెట్టుకున్న వినయంతో వెనుదిరగబోయా,

"భలేవారే బాబూ మీరు! మీకన్నా ఆ పాడు నిద్ర ఎక్కువా నాకు? రండి! రండి అంటూ సాదరంగ ఆహ్వానించింది కుర్చీ వేసి కూర్చోపెట్టింది

"నేనంటే అంత ఇష్టమా వరలక్ష్మి

"ఆ మాట నెమ్మదిగా అంటారేమిటి? బోలెడంత ఇష్టం!"

"ఎందుకని?"

"ఎందుకో మీకు తెలియదా?? ఉండండి కాఫీ పెడతాను పాటలు పాడతారా మిమిక్రీ చేస్తారా?"

"ఆ రెండూ చేయడానికి కాదు నేను వచ్చింది"

"మరి దేనికి?" అంటూ కిసుక్కున నవ్వింది అదోలా చూసి

నరాలు జివ్వుమన్నాయి – నందనరావుకి

"ఓ కథలు చెప్పటానికా? సరే! అలాగే కానీండి మీరేం చేసినా నాకిష్టమే!" అంటూ వంటింట్లోకి వెళ్ళింది వరలక్ష్మి

ఆమె మాటల్ని ఆహ్వానంగా తీసుకున్న నందనరావు ఇక ఆగలేకపోయాడు ఒక్కుదుటున వంటింట్లోకెళ్ళి వరలక్ష్మిని బలంగా కౌగలించుకున్నాడు ఆమెను నలిపేస్తూ బెడ్ మీదకు తీసుకు రావటానికి ప్రయత్నం చేస్తున్నాడు తనకు

పూర్తిగా సహకరిస్తుందనుకున్న వరలక్ష్మి "ఛీ! ఏమిటిది బాబూ! వదలండి" అంది పెనుగు లాడుతూ.

ఆశ్చర్యపోయాడు నందనరావు

"నాతో రాలేస్తే ఆ మృగంగాడెందుకు పనికొస్తాడు

నేను నీకు సుఖానికి సుఖం డబ్బుకు డబ్బు – అన్నీ ఇస్తాను! రా!" అంటూ ఆమెని వశం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నారు నందనరావు

"బాబూ! మర్యాదగా చెపుతున్నాను నాకిష్టం లేదు వదులుతారా లేకపోతే అరిచి మీ పరువు

బజారుపాలు చెయ్యమంటారా ?" దాదాపు గర్జిస్తున్నట్టుగా అన్న మాటలకి భయపడిపోయి వదిలేశాడు నందనరావు

కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ అంది వరలక్ష్మి

"నా మొగుడు మృగం కాదు బాబూ! మంచి మనసున్న మనిషి. అనాకారి అయినా అతనికి నేనంటే ఎంతో ఇష్టం నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకొంటాడు నాకేదన్నా అయితే గిలగిలలాడిపోతాడు తప్పు చెయ్యను అని ఎంత గాఢ నమ్మకం లేకపోతే తన భార్యని తనకన్నా అన్నింటిలో అధికుడయిన మగాడితో ఒంటరిగా వదిలేస్తాడు?"

"కానీ .. మీరేం చేశారు? నా చనువుని, మా ఆయన మంచితనాన్ని అలుసుగా తీసుకున్నారు అవాకృత్యం చేయబోయారు. మీరు డబ్బున్నవాళ్ళు అందగాళ్ళు .. అయినంత మాత్రాన పాటలు పాడి మిమిక్రీ చేసి కథలు చెప్పినంత మాత్రాన ప్రతి ఆడదీ మీకు లొంగిపోతుందని మీ నమ్మకం ఇది మనుషులకు రావలసిన ఆలోచనకాదు మృగాలకు రావలసింది!! నేను గానీ మా ఆయనగానీ అభిమానించింది మీలోని కళాకారుణ్ణి అంతేగానీ డబ్బున్న అందమయిన మృగాన్ని కాదు ఇప్పుడు చెప్పండి బాబూ! అసలయిన మృగం ఎవరో ?!"

తొలిసారిగా వచ్చిన అపజయం చవిచూసిన నందనరావు తలదించుకున్నాడు

"ఈ విషయం మనిద్దరి మధ్యనే మర్చిపోదాం కళాకారుడిగా ప్రతిభావంతుడిగా మీకు మా యింటికి ఎప్పుడూ స్వాగతమే! మృగంగా గనక వస్తే మా

ఆయన మీ పాలిట ఉరిగా మారవలసి వస్తుంది జాగ్రత్త!" అంటున్న వరలక్ష్మి తనకన్నా ఎక్కువ చదువుకున్నదానిగాను సంస్కారవంతురాలిగాను కన్పించింది నందనరావుకి

ఆమెకి ముఖం చూపించలేక నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ స్కూటర్ దగ్గరకు నడిచాడు □